

కెరీర్ ఫెయిర్‌కు హాజరైన వారితో మాట్లాడుతున్న నానో సంస్థ డైరెక్టర్లు శ్రీనివాసరావు, కృష్ణ చైతన్య తదితరులు

ఉన్నత విద్యావకాశాలపై కెరీర్ ఫెయిర్

పంజాగుట్ట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ అనంతరం ఉన్నత విద్య అవకాశాలపై నానో సంస్థ ఆదివారం బేగంపేటలోని ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆడిటోరియంలో కెరీర్ ఫెయిర్ పేరుతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. దేశ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు ఉన్నత చదువులు, కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించారు. అంతకుముందు ఈ ఫెయిర్‌ను నానో సంస్థ డైరెక్టర్లు శ్రీనివాసరావు, కృష్ణ చైతన్య, కో ఆర్డినేటర్ రాఘవాచారిలు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఇంటర్మీడియట్ తర్వాత పలు రకాల కోర్సులు ఉన్నప్పటికీ విద్యార్థులు ఎక్కువగా ఇంజనీరింగ్, మెడిసిన్, సాధారణ డిగ్రీలకే పరిమితం అవుతున్నారన్నారు. ఏ కోర్సు పూర్తి చేస్తే ఏ రంగంలో రాణించవచ్చనే అంశాలను వివరించినట్లు చెప్పారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

హైటెక్‌సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో కాలిఫోర్నియా నుంచి వచ్చిన భరతనాట్య కళాకారుడు వివేక్ రామనన్ అలరిప్పు, వర్ణం అంశాలను ప్రదర్శించి మెప్పించారు. అదే విధంగా అతుల్య ఆర్ట్స్ అకాడమీ లక్ష్మీదుర్గ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో భాగంగా పుష్పాంజలి, మూషికవాహన, అలివేలు మంగ, నటేశకౌతం, తాండవ నృత్యకరి, మండూక శబ్దం, జనుత శబ్దం తదితర అంశాలను ప్రదర్శించి ప్రేక్షకులను మెప్పించారు. సోనాలిక, ప్రణవి, తపన, వేద, హరిణి, జాహ్నవి, లహరి, ఆద్య, లాస్య, శాన్వి, మోక్ష, ఆరాధ్య, శ్రుతికలు తమ నర్తనతో అలరించారు.

బిర్లా మందిర్‌లో నారాయణమ్మ భక్తిగానం



భక్తి పాటలు పాడుతున్న నారాయణమ్మ

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బిర్లా మందిర్ ప్రాంగణంలో ప్రసిద్ధ గాయని నారాయణమ్మ తన బృందంతో కలిసి ఆదివారం నిర్వహించిన భక్తి గానం అలరించింది. భజనలు, హరినామాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తి సాహిత్యం, ఆధ్యాత్మిక సందేశాలను ప్రజల్లో విస్తరించేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

● వృథాగా పోతున్న తాగునీరు



పంజాగుట్ట చౌరస్తా నుంచి ఖైరతాబాద్‌కు వెళ్లే మార్గంలో మెట్రో పిల్లర్ నంబర్ 1,128 వద్ద రెండు నెలలుగా తాగునీరు రోడ్డుపై వృథాగా పోతోంది. అయినా జలమండలి అధికారులు ఈ సమస్యను పట్టించుకోవడం లేదు. మరమ్మతులు చేయాల్సింది పోయి తాత్కాలిక బారికేడ్లు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. అధికారుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

- ఖైరతాబాద్, (ఆంధ్రజ్యోతి)

బిల్డర్స్ సమస్యల పరిష్కారానికి కృషి




ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్‌ను సన్మానిస్తున్న సికింద్రాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు

బౌద్ధనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బిల్డర్స్ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఇటీవల నూతనంగా నియమితులైన సికింద్రాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం మారేడుపల్లిలోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ నోముల ప్రకాశరావు, సికింద్రాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్దెర్ల శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శి మహదేవన్‌రవి, సభ్యులు రాజుసాగర్, అంబాల రాజేశ్వరరావు, వెంకటస్వామి, సుధాకర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నెలా 70 కొత్త కేసులు

- ● ఎర్రగడ్డ ఏఆర్‌టీ సెంటర్‌కు ఇతర రాష్ట్రాల ప్రజలు రాక
- ● నేడు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం



ఎర్రగడ్డ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ అంతానికి స్వచ్ఛంద సంస్థల బాధ్యులు, అధికారులు కంకణబద్ధులై పనిచేస్తున్నారు. విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. అయినా ఏటేటా హెచ్‌ఐవీ బాధితుల సంఖ్య పెరుగుతూ వస్తున్నది. క్షణికానందమో.. మందులు అందుబాటులో ఉన్నాయనే ధీమానో తెలియదు కానీ భయంకరమైన వ్యాధిని కొని తెచ్చుకుంటున్నారు. కొందరు అవగాహన లేక దీని బారిన పడుతుండగా.. మరికొందరు నిర్లక్ష్యానికి మూల్యం చెల్లించుకుంటున్నారు. జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నా.. పట్టించుకోకుండా ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఎర్రగడ్డ చెస్ట్ ఆస్పత్రిలో గడిచిన 18ఏళ్లలో ఏడు వేల కేసులు నమోదయ్యాయి. ప్రతి నెల 60-70 కొత్త కేసులు నమోదవుతున్నాయంటే ఎయిడ్స్ వ్యాధి ఎలా పెరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. నేడు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

2025 థీమ్ ఇదే..

ప్రపంచవ్యాప్తంగా ఎయిడ్స్ మహమ్మారిని తగ్గించడానికి అనేక రకాలుగా కృషి జరుగుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతీ సంవత్సరం ఒక థీమ్‌తో ఎయిడ్స్ వ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తోంది. ఈ సంవత్సరం "పునరాలోచించండి, పునర్నిర్మించండి, పెరగండి" అనేథీమ్‌తో డబ్ల్యూహెచ్‌ఓ ముందుకెళ్తోంది.

ఎర్రగడ్డ చెస్ట్ ఆస్పత్రిలో మందుల పంపిణీ..

ఎర్రగడ్డలోని చెస్ట్ ఆసుపత్రిలో హెచ్‌ఐవీ రోగులకు ఆస్పత్రిలోని ఏఆర్‌టీ సెంటర్ ద్వారా నిత్యం మందులను పంపిణీ చేస్తున్నారు. 2007వ సంవత్సరం నుంచి ఇక్కడ హెచ్‌ఐవీ రోగులకు మందులను అందజేస్తున్నట్టు వైద్యులు తెలిపారు. కాగా గడిచిన 18ఏళ్లలో 7వేల పైచిలుకు కేసులు నమోదయ్యాయి. ప్రతిరోజు 280 నుంచి 300 మంది ఆస్పత్రికి వచ్చి మందులను క్రమం తప్పకుండా తీసుకుని వెళ్తారు. ఎయిడ్స్ వ్యాధిపై ఎంత అవగాహన కల్పించినా ప్రతీ నెలా 60 -70 కొత్త కేసులు నమోదు అవుతుండడం ఆందోళన కలిగించే అంశం. ఇదిలా ఉండగా ఎర్రగడ్డ ఏఆర్‌టీ సెంటర్‌కు తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా పక్క రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, ఒడిషా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి కూడా రోగులు వస్తున్నారని వైద్యులు తెలిపారు.



ఎర్రగడ్డలోని చెస్ట్ ఆస్పత్రి

నివారణే ఉత్తమం

ఎయిడ్స్ వ్యాధిని నిర్మూలించడం సాధ్యమయ్యే విషయం కాదు. కానీ నివారించడం మాత్రం మన చేతుల్లోనే ఉంటుంది. అందుకు వైద్యులు పలు సూచనలు చేస్తున్నారు.

- సురక్షితమైన సంభోగం అవసరం.
- ఒకే లైంగిక భాగస్వామి సురక్షితం.
- సెలూన్ షాపులో కొత్త బ్లేడ్స్ వాడాలి.
- గుర్తింపు పొందిన బ్లడ్ బ్యాంకుల నుంచే రక్తం తీసుకోవాలి.

ఏఆర్‌టీ సెంటర్‌కు వచ్చే రోగులకు సౌకర్యాలు

మందుల కోసం ఏఆర్‌టీ సెంటర్‌కు వచ్చే ఎయిడ్స్ రోగుల పట్ల వివక్షత వహించకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం. గతంలో ఎయిడ్స్ రోగులు కూడా సాధారణ ఓపీకి వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకునే వాళ్లు. అక్కడ ఉండే టీబీ, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు వీరికి సోకకుండా నేరుగా ఏఆర్‌టీ సెంటర్‌లోనే రిజిస్ట్రేషన్ అయ్యేలా చర్యలు తీసుకున్నాం. షుగర్, బీపీ, ఇతరత్రా వ్యాధులు ఉన్న ఎయిడ్స్ రోగులకు కూడా మందులను ఇక్కడే అందజేస్తున్నాం. ప్రతి సంవత్సరం ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించి వారికి బహుమతులను అందజేస్తాం.



- డా.వినోద్‌కుమార్, సీనియర్ మెడికల్ ఆఫీసర్, ఎర్రగడ్డ ఏఆర్టీ సెంటర్

బీసీలకు సామాజిక న్యాయం జరిగే వరకు పోరాటం

- ● ఎంఏఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు నర్సింగరావు



రాజ్యాంగ సమాలోచన సభలో పాల్గొన్న వక్తలు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీసీలకు సామాజిక న్యాయం జరిగే వరకూ తమ పోరాటం కొనసాగుతోందని మన ఆలోచన సాధన సమితి (ఎంఏఎస్ఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగరావు స్పష్టం చేశారు. ఎంఏఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ రామిరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ హాల్‌లో "భారత రాజ్యాంగ సమాలోచన" సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన ఆలోచన సాధన సమితి బీసీల హక్కుల కోసం, అవకాశాల కోసం చేస్తున్న కృషిని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బీసీ కులాల ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వారిని చైతన్య చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. ప్రొఫెసర్ చెన్న బసవయ్య మాట్లాడుతూ.. భారత ప్రజాస్వామ్యంలో అనేక కులాలకు ప్రాతినిధ్యం లేదన్నారు. ఎస్సీలను షెడ్యూల్డ్ కాస్ట్‌గా గుర్తించినప్పుడు బీసీలను బ్యాక్వార్డ్ క్లాసెస్‌గా ఎందుకు పేర్కొన్నారని ప్రశ్నించారు. బీసీలకు ప్రాతినిధ్యమే కాకుండా రాజకీయ అధికారం రావాలని, ఈ దిశగా బీసీలు ఐక్యతగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు కోడెపాక కుమారస్వామి మాట్లాడుతూ బీసీలకు రాజ్యాంగంలో సరైన ఆర్టికల్స్ చేర్చకపోవడం వల్ల అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమలో బీ.ఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వడ్డానపు శ్రీనివాస్, సోషియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ రామ్ షెఫర్డ్, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండా నాగేశ్వరరావు, తడక యాదగిరి, ఎంఏఎస్ఎస్ అధికార ప్రతినిధి ఆవుల వెంకట్ యాదవ్, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, విద్యార్థి నాయకులు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

దేశ సంపదను దోచుకుంటున్న కార్పొరేట్ శక్తులు

- ● రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు



సదస్సులో అభివాదం చేస్తున్న జస్టిస్ చంద్రకుమార్, కోల జనార్దన్ తదితరులు

రాంనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేశంలోని పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులు, బహుళజాతి సంస్థలు భారతదేశ సంపదను దోచుకుంటున్నాయని పలువురు వక్తలు ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దళారీగా వ్యవహరిస్తోందని వారు విమర్శించారు. సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో కమ్యూనిస్టులను ఐక్యం చేయడానికి "మనం ఏమి చేద్దాం" అనే అంశంపై జనార్దన్ అధ్యక్షతన ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి, ప్రముఖ సామాజిక విశ్లేషకుడు పాశం యాదగిరి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, కమ్యూనిస్టు జేఏసీ కో ఆర్డినేటర్ నాగమోని చెన్నరాములు, చెరుకు సుధాకర్ తదితరులు హాజరై మాట్లాడారు. ఆదివాసీలు, రైతులు, కార్మికులను అణచివేసేందుకు రాజ్యాంగ వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టాలను ఉల్లంఘిస్తూ రైతు వ్యతిరేక చట్టాలను తీసుకవచ్చిందని మండిపడ్డారు. ఈ క్లిష్ట సమయంలో ప్రజలు జీవించే హక్కును కాపాడుకోవడం కోసం కమ్యూనిస్టులు ఐక్యం కావాల్సిన చారిత్రక అవసరం ఉందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై ఉమ్మడి కార్యాచరణ రూపొందించుకుని కమ్యూనిస్టులు ఐక్యంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంసీపీఐ నాయకులు రవి, తెలంగాణ ఉద్యమ నాయకుడు గురజాల రవీందర్‌రావు, న్యాయవాది ప్రజ్యోత్, నాయకులు మురహ, పొన్నం దేవరాజ్‌గౌడ్, సతీష్‌రెడ్డి, శ్రీరాములు, సంజీవ్‌కుమార్, బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల రద్దుకు దేశవ్యాప్త ఉద్యమం

- ● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య



సభలో మాట్లాడుతున్న వీరయ్య

భెల్‌కాలనీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన లేబర్ కోడల్‌ను రద్దు చేయకుంటే జాతీయ స్థాయిలో ఉద్యమం తప్పదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య హెచ్చరించారు. బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లో ఆదివారం సీఐటీయూ బీహెచ్ఈఎల్ శాఖ ఆధ్వర్యంలో లేబర్ కోడ్‌లపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల శ్రమను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకే కేంద్రం లేబర్ కోడ్‌లను తీసుకవచ్చిందని ఆరోపించారు. పరిశ్రమలను ప్రైవేటీకరణ చేసి, కార్మిక వర్గాన్ని ఆయా సంస్థలకు బానిసలుగా మార్చేందుకు కేంద్రం లేబర్ కోడ్‌లను రూపొందించిందని ఆయన ఆరోపించారు. వాటిని రద్దు చేసే వరకూ పోరాటాన్ని సాగించాలని వీరయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. నూతన లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, దేశవ్యాప్తంగా ఉన్న కార్మికులు తమ హక్కులు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి రాజయ్య, బీహెచ్ఈఎల్ సీఐటీయూ నాయకులు పెంటయ్య, నాగులు, భాషా, శ్రీనివాస్, రమేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బీజేపీ నాయకురాలు మృతి



ప్రసన్న (ఫైల్)

ఎర్రగడ్డ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న బీజేపీ నాయకురాలు దేరంగుల ప్రసన్న(50) ఆదివారం ఉదయం మృతి చెందారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని వికాసపురి కాలనీలో ఉంటున్న ప్రసన్న కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. 2020లో ఆమె బీజేపీ తరఫున ఎర్రగడ్డ డివిజన్ కార్పొరేటర్‌గా పోటీ చేశారు. ప్రస్తుతం ఆమె బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బేటీ బచావో బేటీ పడావో ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. కాగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రసన్న ఆదివారం ఉదయం మృతి చెందారు. ఆమె మృతదేహానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సదాశివయాదవ్, బీజేపీ నాయకులు ప్రేమ్ కుమార్, నాగేశ్వరరావు, రాజేష్, విజయకుమార్, బీఆర్ఎస్ నాయకులు రావుల శ్రీధర్‌రెడ్డి తదితరులు సందర్శించి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆమె అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం ఈఎస్ఐ శ్మశాన వాటికలో జరిగాయి.

యువకుడి ప్రాణాలు కాపాడిన వైద్యులు

అమీర్‌పేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేటలోని ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి వైద్యులు 30ఏళ్ల యువకుడి ప్రాణాలు కాపాడారు. విపరీతమైన కడుపు నొప్పి, మూడు రోజులుగా కాళ్ల నొప్పులు, ఊపిరి అందని పరిస్థితిలో కన్నడ యువకుడు అమీర్‌పేటలోని ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రిలో చేరాడు. వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు అతడికి రక్తం గడ్డకట్టి, అది గుండెకు రక్తాన్ని తీసుకెళ్లే ప్రధాన రక్తనాళంలోకి చేరినట్లుగా గుర్తించారు. యువకుడి చికిత్స వివరాలను ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జరీ విభాగాధిపతి డా.రంగనాథంరెడ్డి వెల్లడించారు. కన్నడ యువకుడికి గుట్కా తినే అలవాటు ఉంది. అతని రెండు తొడలు గట్టిగా అయిపోయాయి. దీనికి తోడు అతడికి ఇతర సమస్యలూ ఉన్నాయి. వైద్య పరీక్షల్లో బైలెటరల్ పల్మనరీ ఎంబోలిజం (పీఈ) అని తేలింది. దీనికి తోడు రక్తం గడ్డ కట్టి గుండె వరకు వెళ్తోంది. ఈ పరిస్థితిని చూసి పలు విభాగాల వైద్యులను సంప్రదించాం. వెంటనే ఆ యువకుడికి పెనాంబ్రా లైట్నింగ్‌ను ఉపయోగించి రక్తం గడ్డను తొలగించామని ఆయన తెలిపారు. దీంతో పాటు ఐవీసీ ఫిల్టర్ అమర్చి పల్మనరీ యాంజియోగ్రామ్ కూడా చేశామన్నారు. ఈ చికిత్స సీనియర్ న్యూరోసర్జన్ డా.రంగనాథం మార్గదర్శకత్వంలో వాసుక్యులర్ సర్జన్ డా.నాగేశ్వర్‌రావు నిర్వహించారు. తన ప్రాణాలు కాపాడిన వైద్యులకు కన్నడ యువకుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

అమీర్‌పేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట లీలానగర్‌లోని దాత్రి హోమ్స్ అపార్ట్‌మెంట్‌కు చెందిన రంజిత్ మోహన్ అదే అపార్టుమెంట్‌లో ఉన్న ఎనిమిదేళ్ల చిన్నారితో అసభ్యంగా ప్రవర్తించాడు. జరిగిన విషయాన్ని బాలిక ఇంటికి వచ్చి తండ్రికి చెప్పింది. వెంటనే బాలిక తండ్రి ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడి.. యువకుడి అరెస్ట్



భరత్

దిల్‌సుఖ్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన యువకున్ని సరూర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి పోలీసుల వివరాల ప్రకారం.. భరత్ అనే యువకుడు ఈ నెల 26వ తేదీన ఎల్‌బీనగర్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. అయితే డ్రైవింగ్ చేస్తున్న భరత్ హెల్మెట్ ధరించకపోవడంతో కొత్తపేట చౌరస్తాలోని ట్రాఫిక్ సిగ్నల్ వద్ద విధులు నిర్వహిస్తున్న ఎల్‌బీనగర్ ట్రాఫిక్ కానిస్టేబుల్ అప్పారావు బైక్‌ను ఆపాడు. హెల్మెట్ ధరించకపోవడం ట్రాఫిక్ ఉల్లంఘన కింద వస్తుందని చలానా విధించాడు. బైక్ తాళాలు, సెల్‌ఫోన్ తీసుకోవడంతో కొద్దిసేపు వారిద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం వెళ్లిపోయిన భరత్ 15 నిమిషాల తరువాత తిరిగి వచ్చి కానిస్టేబుల్ అప్పారావుపై దాడికి దిగాడు. రాయితో దాడి చేయడంతో పాటు, కానిస్టేబుల్ చేతిలో ఉన్న టాబ్లెట్‌ను కూడా ధ్వంసం చేశాడు. దాడి చేసి వెళ్లిపోతున్న భరత్‌ను అక్కడే ఉన్న మరో కానిస్టేబుల్, స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు సరూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం



అగ్నిప్రమాదంలో కాలిపోయిన ఫర్నిచర్

రాయదుర్గం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని ఏఐజీ హాస్పిటల్ సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం జరిగింది. 4వ అంతస్తులోని ఫ్లాట్ నంబర్ 402లో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో స్వల్ప ఆస్తినష్టం జరిగింది. ఎలాంటి ప్రాణహాని జరగలేదని, పూజదీపం సోఫా మీద పడడంతో అగ్నిప్రమాదం జరిగి ఉండొచ్చని అనుమానిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యం



ప్రీతి

తిరుమలగిరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాలేజీ విద్యార్థిని అదృశ్యమైన ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చింతలబజార్‌కు చెందిన మహేశ్వరి కూతురు ప్రీతి(19) అల్వాల్‌లోని కస్తూర్బా కళాశాలలో డిగ్రీ చదువుతుంది. శుక్రవారం ఉదయం ఐదున్నర గంటలకు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో తల్లి మహేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిద్రావస్థలో నిఘా నేత్రాలు

- ● భెల్ ఎంఐజీకాలనీలో పనిచేయని సీసీ కెమెరాలు
- ● రూ.7.5లక్షల వ్యయంతో గతంలో ఏర్పాటు
- ● నిర్వహణ లోపంతో ఆర్నెళ్లకే పనిచేయని వైనం
- ● పట్టించుకోని సొసైటీ సభ్యులు
- ● నిధులు వృథా చేశారంటూ ప్రజల ఆగ్రహం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, పోలీసు ఉన్నతాధికారులు (ఫైల్)





కాలనీ ప్రధాన చౌరస్తాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

భెల్‌కాలనీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాలనీలో శాంతిభద్రతలను కాపాడేందుకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిద్రావస్థకు చేరుకున్నారు. భారతీనగర్ డివిజన్ పరిధిలోని భెల్ ఎంఐజీకాలనీలో రోజురోజుకు పెరుగుతున్న జనాభా, వాహనాల రాకపోకలతో ప్రధాన, అప్రోచ్ రోడ్లు రద్దీగా మారాయి. దీందో తరచూ ప్రమాదాలు జరుగుతుండడం, గుర్తుతెలియని వాహనాలు ఢీకొట్టి కాలనీవాసులు ప్రమాదాలకు గురవుతుండడంతో గతంలో సొసైటీ నిధులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని తీర్మానించారు. రూ.7.5లక్షల వ్యయంతో కాలనీలో 46 కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రధాన చౌరస్తాలు, రద్దీ ప్రాంతాలు, దేవాలయాల ప్రాంగణాల్లో వీటిని ఏర్పాటు చేసి సొసైటీ కార్యాలయంలో పర్యవేక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం హంగూ ఆర్భాటాల మధ్య 2 ఫిబ్రవరి, 2020లో ప్రజాప్రతినిధులు, పోలీసు ఉన్నతాధికారులు వాటిని ప్రారంభించారు. అయితే ప్రారంభించిన కొద్ది రోజులకే పర్యవేక్షణ లోపంతో అవి అలంకారప్రాయంగా మారాయి. సొసైటీ నిర్లక్ష్యంతో ఆరు నెలలకే మరమ్మతులకు గురయ్యాయి.

మరమ్మతులు చేయని సంస్థ..

నిబంధనల ప్రకారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసే సంస్థ కనీసం ఏడాది పాటు వాటి మరమ్మతుల సౌకర్యాన్ని ఇస్తుంది. అయితే ఎంఐజీ కాలనీలో కెమెరాలు పనిచేయనప్పటికీ వాటిని ఏర్పాటు చేసిన సంస్థతో ఎటువంటి ఒప్పందం చేసుకోకపోవడం, కెమెరాలను ఏర్పాటు చేసిన సంస్థకు పూర్వానుభవం లేకపోవడంతో సొసైటీ కమిటీ సభ్యులు మౌనం వహించారు. తదనంతరం కరోనా రావడం, సొసైటీ కార్యాలయం మూతపడడం, కమిటీ సభ్యుల కాలపరిమితి ముగియడంతో కెమెరాల నిర్వహణపై పట్టించుకునే వారు కరువయ్యారు. మరోవైపు పలు ప్రాంతాల్లో కెమెరాలు, వైర్లు చోరీకి గురయ్యాయి. అనుమానిత వ్యక్తులు, దొంగలను గుర్తించడం, శాంతిభద్రతలను అదుపులో ఉంచడానికి వీటిని ఏర్పాటు చేస్తే నిరుపయోగంగా మారి స్తంభాలకు వేలాడుతూ కనిపిస్తున్నాయి. సొసైటీ నిధులు వృథా కావడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సొసైటీ డైరెక్టర్ల కాలపరిమితి ఐదేళ్లు కాగా, ప్రతీసారి రెండేళ్లకే సభ్యులు రాజీనామాలు చేయడం, కమిటీ రద్దవుతుండడంతో కాలనీ అభివృద్ధి కుంటుపడింది. కనీసం సీసీ కెమెరాలైనా సక్రమంగా పనిచేసే విధంగా సొసైటీ చర్యలు చేపట్టకపోవడంతో ప్రస్తుతం అవి అలంకారప్రాయంగా మారాయి. ఇప్పటికైనా వాటికి మరమ్మతులు చేసి పార్కులు, పాఠశాలలు, ప్రధాన చౌరస్తాల్లో ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరితగతిన సమస్యలను పరిష్కరిస్తాం : శ్రీగణేశ్

మారేడుపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : బస్తీల పర్యటనలో భాగంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ ఆదివారం వార్డు 5లోని శేషాచల కాలనీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీ వాసులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలో అవసరమైన పార్కును అభివృద్ధి చేస్తానని అన్నారు. అలాగే అంతర్గత రహదారులు, డ్రైనేజీ, విద్యుత్ లైన్లను సరిచేయడం వంటి పనులను అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చూస్తానని చెప్పారు. తమ కాలనీ సమస్యలను తెలుసుకోవడానికి వచ్చిన ఎమ్మెల్యేను కాలనీల వాసులు సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సంకి రవీందర్, పెద్దాల నరసింహ, నాగేందర్ యాదవ్, బిక్షపతి, విష్ణు, భరత్ ఉన్నారు.

పార్కును అభివృద్ధి చేయడం అభినందనీయం

తిరుమలగిరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వనిత ఎన్‌క్లేవ్ సొసైటీ ఆధ్వర్యంలో కాలనీలో ఉపయోగంలో లేని టాయిలెట్లను తొలగించి మినీ పార్కును ప్రారంభం చేశారు. స్వచ్ఛందంగా కాలనీ వాసులు పార్కును అభివృద్ధి చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని మిగతా కాలనీల వాసులకు వనిత ఎన్‌క్లేవ్ సొసైటీ ఆదర్శంగా నిలుస్తుందని కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. ఉపయోగంలో లేని టాయిలెట్లను తొలగించడానికి కంటోన్మెంట్ అధికారులతో మాట్లాడడం జరిగిందని, వారు సహకరించినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నానని తెలిపారు. ఈ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేతో పాటు కాలనీ అధ్యక్షులు వినోద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రేమండ్ హార్వుడ్, నాగసేని సరిత, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్‌కు జ్ఞానమాల సమర్పించిన ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ సభ్యులు

ఆదర్శనీయుడు అంబేడ్కర్

తిరుమలగిరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆయన రచించిన రాజ్యాంగం, రిజర్వేషన్ ద్వారానే బడుగు, బలహీన వర్గాలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతున్నారని ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ కమిటీ అభిప్రాయపడింది. ఆదివారం బొల్లారం సాధనమందిరం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్లతో బలహీన వర్గాల్లో ఆయన వెలుగులు నింపారు అన్నారు. ఎస్సీ సొసైటీకి సేవలు చేస్తున్నందుకు ఉదయ్ కుమార్, కేజీ రాజు, భీమ్ రావు, కేజీ రవిలను సొసైటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అశోక్, పీడీ అశోక్ కుమార్, తులసీ దాస్, ప్రిథ్వీ రాజ్, రమణలు పాల్గొన్నారు.

నేడు గాంధీ ఆస్పత్రిలో ఎయిడ్స్ డే

అడ్డగుట్ట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా సోమవారం గాంధీ ఆస్పత్రి ఆవరణలో వైద్యులతో పాటు నర్సులు, ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు గాంధీ ఆస్పత్రి జనరల్ మెడిసిన్ విభాగాధిపతి ప్రొఫెసర్ సునిల్ కుమార్ తెలిపారు. కార్యక్రమానికి సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.



గాంధీలో చికిత్స పొందుతూ నిరసన వ్యక్తం చేస్తున్న బత్తుల సిద్దేశ్వర పటేల్

బీసీ రిజర్వేషన్‌పై మాట తప్పిన సీఎం : బత్తుల

అడ్డగుట్ట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను ఎన్నికలకు ముందే ఇస్తానని చెప్పిన సీఎం రేవంత్ మాట తప్పారని హిందూ బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్ పటేల్ ఆరోపించారు. 28న గాగిల్లాపూర్‌లోని తన ఇంటి వద్ద బీసీ రిజర్వేషన్‌పై చేస్తున్న దీక్షను భగ్నం చేసి పోలీసులు వైద్య పరీక్షల నిమిత్తం గాంధీలో ఆస్పత్రిలో ఆయనను చేర్పించారు. దీక్ష చేపట్టి ఆదివారం రెండో రోజు కావడంతో చికిత్స పొందుతూనే ప్లకార్డుతో నిరసన వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ అమలు పరిచి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా గాంధీకి వచ్చిన వివిధ సంఘాల ప్రతినిధులు బత్తులకు సంఘీభావం తెలిపారు.



విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శశాంక్‌రెడ్డి తదితరులు

సైబర్ నేరాలపై అవగాహన

బౌద్ధనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే స్పందించవద్దని చిలకలగూడ డివిజన్ ఏసీపీ శశాంక్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ప్రైవేట్ స్కూలులో సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు పలు విషయాలను సూచించారు. ఆన్‌లైన్ ఫైనాన్షియల్ ఫ్రాడ్స్ నమ్మవద్దని, యూపీఐ, క్యూఆర్‌కోడ్‌లు చేయవద్దని, ఉద్యోగ మోసాలు, ఓటీపీ, ఫిషింగ్ లింక్‌లు, స్క్రీన్ షేరింగ్ యాప్‌లు, నకిలీ కస్టమర్ కేర్ నంబర్లు, మోసపూరిత వెబ్‌సైట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఓటీపీ, పిన్, సీవీవీ బ్యాంక్ వివరాలు, వ్యక్తిగత వివరాలను ఎవరితో పంచుకోవద్దని సూచించారు. ఆర్థికనష్టం జరిగిన వెంటనే 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డి, ఎస్సై రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

మౌలాలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వరదనీటి ముంపు నివారణకు పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టామని, ఆ పనులలో నాణ్యత పాటించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మౌలాలి డివిజన్ కార్పొరేటర్ గున్నాల సునీతయాదవ్ అన్నారు. ఆదివారం డివిజన్‌లోని వెంకటేశ్వరనగర్ కాలనీలో జేబీఆర్ స్కూల్, సాయి స్వప్న ఆస్పత్రి వీధిలలో చేపట్టిన వరదనీటి పైపులైన్ నిర్మాణ పనులకు కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. పనులు మంద కొండిగా సాగుతున్నాయని, త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు. పనుల్లో నాణ్యత పాటించేలా చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు, బీజేపీ నాయకులు గున్నాల చంద్రశేఖర్‌యాదవ్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



ప్రీతి

తిరుమలగిరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాలేజీ విద్యార్థినీ అదృశ్యమైన ఘటన బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం చింతలబజార్‌కు చెందిన మహేశ్వరి కూతురు కె.ప్రీతి(19) అల్వాల్‌లోని కస్తూర్బా కాలేజీలో డిగ్రీ చదువుతుంది. శుక్రవారం ఉదయం ఐదున్నర గంటలకు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో తల్లి మహేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధికి బాటలు వేద్దాం : ఎమ్మెల్యే



కార్యక్రమంలో నామినేటెడ్ మెంబర్ భానుక నర్మదా మల్లిఖార్జున, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జె.రామకృష్ణ, అసోసియేషన్ సభ్యులు



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

మారేడుపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధికి ప్రజలు భాగస్వాములై బాటలు వేసుకుంటూ ముందుకు సాగాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్ అన్నారు. కార్ఖానా కోటేశ్వరరావు కాలనీలోని ఏకలవ్య ఎరుకల షెడ్యూల్డ్ ట్రైబల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 75 లక్షల రూపాయల వ్యయంతో స్వయంగా నిర్మించుకున్న జీ ప్లస్ టు బహుళ అంతస్తు కమ్యూనిటీ హాల్ ప్రారంభ కార్యక్రమంలో ఆదివారం ఎమ్మెల్యే, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ భానుక నర్మదా మల్లిఖార్జున, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జె. రామృష్ణలు పాల్గొన్నారు. కాగా అసోసియేషన్‌లోని 300 మంది మెంబర్లు ఒక్కొక్కరూ రూ. 25 వేలు వేసుకుని మొత్తం రూ.75 లక్షలు పోగు చేసి 150 గజాల స్థలంలో జీ ప్లస్ టు కమిటీ హాల్‌ను నిర్మించారు. ఇందులో లైబ్రరీ, రీడింగ్ హాల్, కమ్యూనిటీ హాల్‌ను నిర్మించారు. అలాగే ఆర్థిక స్తోమత లేని విద్యార్థులకు ఇక్కడ నిర్మించిన కమిటీ హాల్‌లో హాస్టల్ వసతిని ఉచితంగా ఏర్పాటు చేశారు. అనంతరం నామినేటెడ్ మెంబర్ భానుక నర్మదా మల్లికార్జున మాట్లాడుతూ ఎవరో వస్తారని ఏదో చేస్తారనే బదులు మనకు మనమే భాగస్వాములై అభివృద్ధికి బాటలు వేసుకుని ముందుకు సాగుతున్న అసోసియేషన్ మెంబర్స్‌ను ఆమె కొనియాడారు. అంతకుముందు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ వీడియో కాల్ ద్వారా అసోసియేషన్‌కు తన సహాయ సహకారాలు ఎల్లవేళలా అందించడానికి కృషి చేస్తానని అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కె. గంగా ప్రసాద్, ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, కోశాధికారి శ్రీ రామనందం సదానందం, అడ్వైజర్ కె. రఘునాథ్, ఉపాధ్యక్షుడు కె. శ్యామ్ కుమార్, ప్రతినిధులు శ్రీ రామానంద్, ప్రతాప్, మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను సత్కరిస్తున్న సికింద్రాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు

బిల్డర్స్ సమస్యల పరిష్కారానికి కృషి: తలసాని

బౌద్ధనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బిల్డర్స్ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఇటీవల నూతనంగా నియమితులైన సికింద్రాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం మారేడుపల్లిలోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ నోముల ప్రకాశరావు, సికింద్రాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్దెర్ల శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శి మహదేవన్‌రవి, సభ్యులు రాజుసాగర్, అంబాల రాజేశ్వరరావు, వెంకటస్వామి, సుధాకర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా : తలసాని

మారేడుపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం రాంగోపాల్‌పేట డివిజన్‌లోని నల్లగుట్ట బస్తీవాసులు, రాజస్థాన్ సేవా మండల్ ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి పలు సమస్యలను విన్నవించారు. కాగా బస్తీలోని కమ్యూనిటీ హాల్‌ను తాము కూడా ఉపయోగించుకునే అవకాశం కల్పించాలని నల్లగుట్ట వాసులు ఎమ్మెల్యేను కోరగా, బస్తీవాసుల సౌకర్యార్థం నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగుట్ట వాసులు, రాజస్థాన్ మండల్ ప్రతినిధులు ఉన్నారు.



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

మల్కాజిగిరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ ఉరపల్లి శ్రవణ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆనంద్‌బాగ్ కమ్యునిటీ హాల్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మెడికవర్ హాస్పటల్, సన్‌డెంటల్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 200 మంది వరకు దంత, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్, రక్త పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రవణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలను ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మురళీకృష్ణ, నాగేశ్వర్‌రావు, వెంకటాచలం, సునీత, నందు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు సామాజిక న్యాయం జరిగే వరకు పోరాటం

- ఎంఏఎస్‌ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు నర్సింగరావు



రాజ్యాంగ సమాలోచన సభలో పాల్గొన్న వక్తలు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీసీలకు సామాజిక న్యాయం దక్కే వరకూ తమ పోరాటం కొనసాగుతుందని మన ఆలోచన సాధన సమితి (ఎంఏఎస్‌ఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగరావు స్పష్టం చేశారు. ఎంఏఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ జి.రామిరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ హాల్‌లో "భారత రాజ్యాంగ సమాలోచన" సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఆలోచన సాధన సమితి బీసీల హక్కుల కోసం, అవకాశాల కోసం చేస్తున్న కృషిని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బీసీ కులాల ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వారిని చైతన్య చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. ప్రొఫెసర్ చెన్న బసవయ్య మాట్లాడుతూ భారత ప్రజాస్వామ్యంలో అనేక కులాలకు ప్రాతినిధ్యం లేదన్నారు. ఎస్సీలను షెడ్యూలు కాస్ట్‌గా గుర్తించినప్పుడు బీసీలను బ్యాక్వర్డ్ క్లాసెస్‌గా ఎందుకు పేర్కొన్నారని ప్రశ్నించారు. బీసీలకు ప్రాతినిధ్యమే కాకుండా రాజకీయ అధికారం రావాలని, ఈ దిశగా బీసీలు ఐక్యతగా ముందుకు సాగాలని సూచించారు. బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు కోడెపాక కుమారస్వామి మాట్లాడుతూ బీసీలకు రాజ్యాంగంలో సరైన ఆర్టికల్స్ చేర్చకపోవడం వల్ల అన్యాయం జరిగిందన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ప్రవేశపెట్టడమే ఒక కుట్ర కోణంలో జరిగిందన్నారు. కార్యక్రమలో బి.ఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వడ్డానపు శ్రీనివాస్, సోషియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ రామ్ షెపర్డ్, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండా నాగేశ్వరరావు, తడక యాదగిరి, ఎంఏఎస్‌ఎస్ అధికార ప్రతినిధి ఆవుల వెంకట్ యాదవ్, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, విద్యార్థి నాయకులు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

దేశ సంపదను దోచుకుంటున్న కార్పొరేట్ శక్తులు

- కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దళారీగా వ్యవహరిస్తోంది
- రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు



సదస్సులో అభివాదం చేస్తున్న జస్టిస్ బి.చంద్రకుమార్, కోల జనార్దన్ తదితరులు

రాంనగర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : దేశంలోని పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులు, బహుళజాతి సంస్థలు భారతదేశ సహజ సంపదను దోచుకుంటున్నాయని పలువురు వక్తలు ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దళారీగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కమ్యూనిస్టులను ఐక్యం చేయడానికి మనం ఏమి చేద్దాం అనే అంశంపై కోల జనార్దన్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి, ప్రముఖ సామాజిక విశ్లేషకుడు పాశం యాదగిరి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, కమ్యూనిస్టు జేఏసీ కో-ఆర్డినేటర్ నాగమోని చెన్నరాములు, చెరుకు సుధాకర్ తదితరులు హాజరై మాట్లాడారు. ఆదివాసీలు, రైతులు, కార్మికులను అణచివేసేందుకు రాజ్యాంగ వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టాలను ఉల్లంఘిస్తూ రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చిందని మండిపడ్డారు. ఈ క్లిష్ట సమయంలో ప్రజల మౌళిక హక్కుల కోసం ప్రాథమిక హక్కుల రక్షణ కోసం జీవించే హక్కును కాపాడుకోవడం కోసం కమ్యూనిస్టులు ఐక్యం కావాల్సిన చారిత్రక అవసరం ఉందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై ఉమ్మడి కార్యాచరణ రూపొందించుకుని కమ్యూనిస్టులు ఐక్యంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంసీపీఐ నాయకులు గాదగోని రవి, తెలంగాణ ఉద్యమ నాయకుడు గురజాల రవీందర్‌రావు, న్యాయవాది ప్రజ్యోత్, నాయకులు మురహ, పొన్నం దేవరాజ్‌గౌడ్, సతీష్‌రెడ్డి, శ్రీరాములు, సంజీవ్‌కుమార్, బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బీసీ విద్యార్థి జేఏసీ నాయకులు

ఎల్లమ్మగూడెం ఘటనపై న్యాయం చేయాలి

- బీసీ విద్యార్థి జేఏసీ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నల్గొండ జిల్లా తిప్పర్తి మండలం ఎల్లమ్మగూడెంలో మామిడి యాదగిరిపై జరిగిన దారుణంపై న్యాయం చేయాలని బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ కొమ్మనబోయిన సైదులు యాదవ్ డిమాండ్ చేశారు. ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బీసీ విద్యార్థి జేఏసీ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్ నామినేషన్ వేయడానికి వచ్చిన మామిడి లక్ష్మి భర్త యాదగిరిని ఆధిపత్య కులస్తులు కిడ్నాప్ చేసి రెండు రోజులుగా చిత్రహింసలు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో బీసీలకు కూడా పోటీ చేసే హక్కు ఉందని, భయభ్రాంతులకు గురి చేయడం సమాజం సిగ్గుపడే చర్య అన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీని కోరారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం కన్వీనర్ లింగయ్య యాదవ్, నాయకులు గంగుల మధు యాదవ్, మల్లేష్ యాదవ్, కదారి రమేష్, నూకల మధు, ఆవుల శ్రీధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై యువకుడి దాడి

- చలానా విధించి, సెల్‌ఫోన్ లాక్కున్నాడని దౌర్జన్యం



దాడికి పాల్పడిన భరత్

దిల్‌సుఖ్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన యువకున్ని సరూర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి పోలీసుల వివరాల ప్రకారం.. భరత్ అనే యువకుడు ఈ నెల 26వ తేదీన ఎల్‌బీనగర్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. అయితే డ్రైవింగ్ చేస్తున్న భరత్ హెల్మెట్ ధరించకపోవడంతో కొత్తపేట చౌరస్తాలోని ట్రాఫిక్ సిగ్నల్ వద్ద విధులు నిర్వహిస్తున్న ఎల్‌బీనగర్ ట్రాఫిక్ కానిస్టేబుల్ అప్పారావు బైక్‌ను ఆపాడు. హెల్మెట్ ధరించకపోవడం ట్రాఫిక్ ఉల్లంఘన కింద వస్తుందని చలానా విధించాడు. బైక్ తాళాలు, సెల్‌ఫోన్ తీసుకోవడంతో కొద్ది సేపు వారిద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం వెళ్లిపోయిన భరత్ 15 నిమిషాల తరువాత తిరిగి వచ్చి కానిస్టేబుల్ అప్పారావుపై దాడికి దిగాడు. రాయితో దాడి చేయడంతో పాటు, కానిస్టేబుల్ చేతిలో ఉన్న ట్యాబ్లెట్‌ను కూడా ధ్వంసం చేశాడు. దాడి చేసి వెళ్లిపోతున్న భరత్‌ను అక్కడే ఉన్న మరో కానిస్టేబుల్, స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు సరూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ఎమ్మెల్యే మర్రిని సన్మానిస్తున్న ఆర్‌కేనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

రైల్వేస్టేషన్‌కు రాధాకృష్ణనగర్ పేరు

మల్కాజిగిరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరిలో కొత్తగా ఏర్పాటు చేసిన రైల్వే స్టేషన్‌కు కాలనీపేరు అయిన రాధాకృష్ణనగర్ (ఆర్‌కేనగర్) పెట్టడం గర్వకారణమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. ఆర్‌కేనగర్ కాలనీ సంక్షేమ సంఘ భవనంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మర్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రైల్వేశాఖ, రాష్ట్రప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటూ కాలనీప్రజల ఆశయాలను నెరవేర్చేవిధంగా ఆర్కేనగర్ రైల్వే స్టేషన్ పేరు పొందగలిగామని ఎమ్మెల్యే అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే మూడు సంవత్సరాల్లో ప్రధానంగా ఆర్‌యూబీ, ఆర్‌ఓబీ, ఏటీసీ అదనపు రోడ్లు ప్రజలకు అందుబాటులో రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్. జగదీష్‌గౌడ్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సోమశేఖర్, రవికిరణ్, గుప్తా, రాఘవేంద్ర, సాయినాథ్, సురేందర్, వడ్డి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలి

ముషీరాబాద్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్యతోపాటు క్రీడలపై దృష్టి సారించాలని గిన్నిస్ బుక్ రికార్డు గ్రహీత కొండ సహదేవ్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ సమీపంలో పద్మారావునగర్‌లో సాయి రక్ష అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు తైక్వాండోలో గ్రేడింగ్ కలర్ బెల్ట్ పోటీలను నిర్వహించారు. విజేతలకు కొండ సహదేవ్, సీనియర్ క్రీడాకారుడు సంజయ్‌లు గ్రేడింగ్ కలర్‌బెల్ట్, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తైక్వాండో క్రీడలు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణిస్తూ రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా 100మంది విద్యార్థులకు గ్రేడింగ్ కలర్ బెల్ట్‌లను పంపిణీ చేశారు. తైక్వాండో సీనియర్ కోచ్ కృష్ణ, లక్ష్మీనారాయణ, రాకేషకుమార్, జయేంద్ర, వైష్ణవి, సాకేత్, అమృతలు పాల్గొన్నారు.

మైనంపల్లిని కలిసిన ఎమ్మెల్యే నవీన్‌యాదవ్



మైనంపల్లిని కలిసి పూలబొకే ఇస్తున్న ఎమ్మెల్యే నవీన్‌యాదవ్

అల్వాల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గం తాజాగా ఎమ్మెల్యేగా విజయం సాధించిన నవీన్ యాదవ్ ఆదివారం కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావును ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు.అనంతరం నవీన్‌యాదవ్ మైనంపల్లి హనుమంతరావు ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

హైటెక్‌సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం కాలిఫోర్నియా నుంచి వచ్చిన భరతనాట్య కళాకారుడు వివేక్ రామనన్ అలరిప్పు, వర్ణం అంశాలను ప్రదర్శించి మెప్పించారు. అదే విధంగా అతుల్య ఆర్ట్స్ అకాడమీ లక్ష్మీదుర్గ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో భాగంగా పుష్పాంజలి, మూషిక వాహన, అలివేలు మంగ, నటేశకౌతం, తాండవ నృత్యకరి, మండూక శబ్దం, జనుత శబ్దం తదితర అంశాలను ప్రదర్శించి ప్రేక్షకులను మెప్పించారు. సోనాలిక, ప్రణవి, తపన, వేద, హరిణి, జాహ్నవి, లహరి, ఆద్య, లాస్య, శాన్వి, మోక్ష, ఆరాధ్య, శ్రుతికలు తమ నర్తనతో అలరించారు.





నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు